## క్లుప్తంగా

### జగనన్న పర్యటనను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

● మాజీ మంత్రి మేరుగు నాగార్జున



సంతనూతలపాడు: రైతుల సమస్యలపై బుధవారం పొదిలిలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పర్యటనకు సంతనూతలపాడు నియోజకవర్గ నుంచి తరలివచ్చి విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధన్యవాదాలు తెలిపారు. పొదిలి తరలివచ్చి జగనన్న పోరుబాట కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్క వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.

### బాధ్యతలు స్వీకరించిన మద్దిపాడు తహసీల్దార్



తహసీల్దార్ ఆదిలక్ష్మి

మద్దిపాడు: మండలానికి నూతన తహసీల్దార్‌గా వి.ఆదిలక్ష్మి బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. సంతనూతలపాడు మండలం నుంచి బదిలీపై ఆమె వచ్చారు. గతంలో మద్దిపాడులో చాలా కాలం ఆర్‌ఐగా ఆమె పనిచేశారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సిబ్బందితో మాట్లాడి మండల స్థితిగతులు తెలుసుకున్నారు. నూతన తహసీల్దార్‌కు పలువురు సిబ్బంది, నాయకులు బొకేలిచ్చి అభినందనలు తెలిపారు.

### కొత్తపట్నం నూతన తహసీల్దార్‌గా శాంతి...



తహసీల్దార్ శాంతి

కొత్తపట్నం : మండల నూతన తహసీల్దార్‌గా కె.శాంతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. గతంలో పొదిలిలో, ప్రస్తుతం దోర్నాల మండలంలో పనిచేస్తూ బదిలీపై కొత్తపట్నం వచ్చినట్లు చెప్పారు. రెవెన్యూ సమస్యలపై నేరుగా తనకు అర్జీలిచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యాలయాన్ని పరిశీలించారు. పిచ్చిచెట్లు, చెత్తాచెదారం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. నూతన తహసీల్దార్‌కు డీటీ కృష్ణమోహన్, ఆర్.వరకుమార్, వీఆర్వోలు, నాయకులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు.

### సీసీ రోడ్లు ప్రారంభం

కొత్తపట్నం: మండలంలోని ఏడు పంచాయతీలలో 280 పనులకుగానూ రూ.7.4 కోట్లతో సీసీ రోడ్లు పూర్తి చేసినట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తెలిపారు. బుధవారం సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కొత్తపట్నం, కె.పల్లెపాలెం, రంగాయపాలెం, పాదర్తి గ్రామాల్లో నూతనంగా 17 మందికి రూ.4 వేల చొప్పున వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.కృష్ణ, తహసీల్దార్ కె.శాంతి, డిప్యూటీ ఎంపీడీవో వేణు, పీఆర్ ఏఈ రామ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### నవజాత శిశువుల సంరక్షణే లక్ష్యం

● ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కంగారు విభాగం ప్రారంభం



కంగారు యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: నవజాత శిశువుల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కంగారు యూనిట్ (నవజాత శిశు సంరక్షణ కేంద్రం)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రితోపాటు కనిగిరిలో కూడా కంగారు యూనిట్ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వసతులు, వైద్య పరికరాలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ నిబద్ధతగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ సుజాత, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

### నేత్రపర్వంగా రాజరాజేశ్వర స్వామి పరిణయం

ఒంగోలు మెట్రో: స్థానిక తూర్పుపాలెం శివాలయం (కొత్తపట్నం బస్టాండ్ సర్కిల్ వద్ద)లోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. చివరిరోజు బుధవారం ఉదయం గణపతి పూజ, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. గంగా పార్వతీ సమేత శ్రీ రాజరాజేశ్వరస్వామికి నేత్రపర్వంగా కళ్యాణ క్రతువు నిర్వహించారు. సాయంత్రం పార్వతీదేవి అమ్మవారికి కుంకుమార్చన, అలంకరించిన నంది వాహన రథంపై నగరోత్సవం నిర్వహించారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బొకే అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పక్కన మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, తదితరులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నగర అధ్యక్షుడు కఠారి శంకర్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

# జగనన్నకు తోడుగా.. అన్నదాతకు అండగా..!

● పొదిలిలో వైఎస్ జగన్ పర్యటనకు భారీగా తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు
● ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి కదంతొక్కిన కార్యకర్తలు
● ఒంగోలు టూ పొదిలి.. వయా సంతనూతలపాడు, చీమకుర్తి.. కిక్కిరిసిన రహదారులు

ఒంగోలు సిటీ: రైతుల సమస్యలపై పోరాడేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం పొదిలిలో పర్యటించారు. తమ అధినేత జగనన్నపై అభిమానంతో రైతుల కోసం ఆయన చేస్తున్న పోరాటానికి తోడుగా నిలిచేందుకు, తద్వారా అన్నదాతలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు భారీ సంఖ్యలో పొదిలి తరలివెళ్లారు. ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు కదంతొక్కారు. జగనన్న పర్యటనలో పాల్గొనేందుకు వారివారి ప్రాంతాల నుంచి ర్యాలీగా పొదిలి చేరుకున్నారు. దీంతో ఒంగోలు నుంచి సంతనూతలపాడు, చీమకుర్తి మీదుగా పొదిలి వెళ్లే రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసాయి. వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో 100 కార్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా పొదిలి బయలుదేరి వెళ్లారు. అధిక సంఖ్యలో పాల్గొని జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు చుండూరి రవిబాబు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొత్తపట్నం మండలం నుంచి...**

కొత్తపట్నం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పర్యటనలో పాల్గొనేందుకు కొత్తపట్నం మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. వాహనాలకు వైఎస్సార్ సీపీ జెండాలు కట్టుకుని నినాదాలు చేసుకుంటూ పొదిలి చేరుకున్నారు. మండలంలోని అల్లూరు, ఆలూరు, గాదెపాలెం, బీరంగుంట, గుండమాల, మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, కె.పల్లెపాలెం, కొత్తపట్నం, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, ఈతముక్కల, మడనూరు, సంకువారిగుంట గ్రామాల నుంచి తరలివెళ్లి పొదిలిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**చీమకుర్తి మండలం నుంచి...**

చీమకుర్తి రూరల్: రైతుల కోసం జగనన్న నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి చీమకుర్తి మండలం, పట్టణం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పొదిలి తరలివెళ్లారు. చీమకుర్తి మండలం, పట్టణం నుంచి 80 కార్లు, 1000 బైకులపై పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో వేల సంఖ్యలో పొదిలి చేరుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

**50 వాహనాల్లో వెళ్లిన నాయకులు...**

సంతనూతలపాడు: పొగాకు రైతుల సమస్యలపై పోరాటానికి బుధవారం పొదిలి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి సంతనూతలపాడు మండలం నుంచి సుమారు 100 వాహనాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పర్యవేక్షణలో సంతనూతలపాడు మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పొదిలి వెళ్తూ సంతనూతలపాడులో ఆగగా, దుంపా చెంచిరెడ్డి వారిని కలిసి మాట్లాడారు. అనంతరం వారంతా పొదిలి వెళ్లారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఉపసర్పంచ్ ఐవీ సుబ్బయ్య, ఎంపీటీసీ ఎస్‌కే రహంతుల్లా, వైఎస్సార్ సీపీ నేతలు రావూరి శ్రీనివాసరెడ్డి, కే నాగాంజనేయులు,, తన్నీరు మోహన్‌రావు, కరుకు సుబ్బారావు, వల్లపు శ్రీను, కే లక్ష్మణ్, డాక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో వైవీ సుబ్బారెడ్డి, టీజేఆర్‌తో వైఎస్సార్ సీపీ నాయకుడు దుంపా చెంచిరెడ్డి, తదితరులు



ఒంగోలు నుంచి పొదిలికి కార్ల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న చుండూరి రవిబాబు



కొత్తపట్నం నుంచి పొదిలి వెళ్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, నాయకులు



చీమలమర్రి గ్రామం నుంచి పొదిలి వెళ్తున్న నాయకులు



ఒంగోలులో నినాదాలు చేస్తున్న నాయకులు



పులికొండ గ్రామం నుంచి పొదిలి వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



మంచికలపాడు గ్రామం నుంచి పొదిలి వెళ్తున్న నాయకులు



పి.నాయుడుపాలెం గ్రామం నుంచి పొదిలి వెళ్తున్న అభిమానులు

## మహిళలకు విద్య, ఉపాధి చూపించాలి



మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ ఉదయిని

సంతనూతలపాడు: సామాజికంగా వెనకబడి ఉన్న మహిళలను గుర్తించి వారికి విద్య, ఉపాధి అవకాశాలను మరింత విస్తృతంగా కల్పించడం ద్వారా సమాజం వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయని బెతూన్ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ ఎస్.ఉదయిని అన్నారు. సంతనూతలపాడులోని సుందరయ్య భవన్లో నెల రోజులుగా ఐద్వా ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి మాట్లాడారు. ఐద్వా లాంటి సంస్థలు సమాన హక్కుల కోసం, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేయడంతో పాటు మహిళలకు ఇటువంటి శిక్షణ కేంద్రాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, మండల కార్యదర్శి నెరుసుల మాలతి, నాయకుడు టి.అంకమ్మ, టైలరింగ్ టీచర్ సీహెచ్ అనూరాధ పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎల్ నరసింహారావు, బీజేపీ నాయకులు

ఒంగోలు సిటీ: అమ్మకోసం ఒక మొక్క అనే నినాదంతో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు కోరారు. బుధవారం ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ 11 సంవత్సరాల సుపరిపాలన దినోత్సవంలో భాగంగా ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మ కోసం ఒక మొక్క అనే నినాదంతో మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ఇంటలెక్చువల్ సమావేశంలో సభాధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కూకట్ల నాగేశ్వరరావు, మాకినేని అమరసింహం, దండు శ్రీనివాసరావు కావూరి వాసు, జె.రమాదేవి, ఆశారావు, విజయరావు, బొద్దులూరి అంజనేయులు, దామోదర్, కె.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## బౌద్ధ ధర్మంతోనే సామాజిక న్యాయం



ర్యాలీ నిర్వహిస్తున్న బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ప్రతినిధులు

ఒంగోలు వన్‌టౌన్: బౌద్ధ ధర్మంతోనే సామాజిక న్యాయం, ప్రపంచ శాంతి సాధ్యపడతాయని డాక్టర్ సుధాకర్‌బాబు అన్నారు. పౌర్ణమి సందర్భంగా ఒంగోలు బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో బుధవారం బౌద్ధ ధర్మ ప్రచార యాత్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కూడా 90 శాతం బౌద్ధ రాజ్యాంగమేనన్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట నుంచి మున్సిపల్ కార్యాలయం, ఉప్పరపాలెం మీదుగా దేవుడు చెరువు పార్కు వద్ద గల బౌద్ధ విగ్రహం వరకూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బుద్ధ వందనం చేశారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు, జి.నాగేశ్వరరావు, పి.మోహన్‌రావు, పేరం సత్యం తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి స్టూడెంట్ పాస్‌ల జారీ

ఒంగోలు టౌన్: ఏపీఎస్ ఆర్టీసీ స్టూడెంట్ బస్సు పాస్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిందని, దాన్ని ఇన్‌స్టాల్ చేసే ప్రక్రియ నడుస్తోందని ఆర్టీసీ డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో 12, 13 తేదీల్లో విద్యార్థులకు బస్ పాస్‌లు ఇవ్వరని, 14వ తేదీ నుంచి యధాతథంగా పాస్‌లు ఇస్తారని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి సహకరించాలని కోరారు. అలాగే బస్సు పాస్‌ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునే వెసులుబాటు కలిగించినట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్టర్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పూలంగి సేవలో సాయినాథుడు



ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా బాబా వారికి పంచామృతాభిషేకాలు, అర్చన, పూజా క్రతువులను వైభవంగా నిర్వహించారు. మందిరంలోని సాయినాథుడు, ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, దత్తాత్రేయస్వామివారి మూలవిరాట్లను చక్కగా అలంకరించి పూలంగి సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## శ్రీవారికి జ్యేష్టాభిషేక మహోత్సవం

ఒంగోలు మెట్రో: నగరంలోని కేశవస్వామిపేటలో ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ఉన్న వెంకటేశ్వరస్వామి సన్నిధానంలో బుధవారం జ్యేష్ఠ మాసం సందర్భంగా జ్యేష్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రాంగణంలోని శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి రావెళ్ల శివశంకర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ యాక్టును సీఎం దుర్వినియోగం చేశారు

● కోర్టు మందలించడంతో హోం మంత్రితో తొలగించారు



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: అమరావతి మహిళలకు అవమానం కేసులో ఎస్సీ, ఎస్టీ యాక్టును సీఎం చంద్రబాబు దుర్వినియోగం చేశారని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. ఒంగోలులోని సమితి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెనాలి ఘటనలో నేరానికి కులం, మతం ఉండదన్న హోం మంత్రి.. అమరావతి ఘటనలో మాత్రం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారన్నారు. న్యూస్ డిబేట్‌లో మహిళల గురించి మాట్లాడితే బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు. కానీ, కంభంపాటి శిరీష అనే మహిళతో కుల ప్రస్తావనే లేని డిబేట్‌పై ఎస్సీ, ఎస్టీ యాక్టు ప్రకారం చంద్రబాబు కేసు నమోదు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వంలో నిజమైన ఎస్సీ, ఎస్టీ బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో ఎటువంటి విచారణ లేకుండా కేసు నమోదు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నప్పటికీ, అట్రాసిటీ యాక్టు అమెండ్‌మెంట్ చేసినప్పటికీ కూటమి ప్రభుత్వం యాక్టుకు తూట్లు పొడుస్తోందన్నారు. గతంలో యాక్టు అమలుకు ప్రతి జిల్లాకు ఇద్దరు డీఎస్పీలు ఉండేవారన్నారు. ప్రస్తుతం ఒక డీఎస్పీని కూడా నియమించలేదన్నారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, శాంతకుమార్, ఆదినారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో దోమల నివారణ మందు పిచికారీ



ప్రభుత్వ స్కూల్లో దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

సంతనూతలపాడు: సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏపీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టల్లో బుధవారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో దోమలు పుట్టకుండా, కుట్టకుండా ముందు జాగ్రత్త చర్యగా దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి డి.మధుసూదనరావు తెలిపారు. ఆయా పనులను ఆయన పర్యవేక్షించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. దోమ కాటు వలన డెంగీ, మలేరియా, బోధకాలు వ్యాధి, చికున్ గునియా వంటి వ్యాధులు వస్తాయని, అవి రాకుండా ముందు జాగ్రత్తగా పాఠశాలలు, హాస్టళ్లలో ఏసీఎం ఐదు శాతం ఫోకల్ పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ పమిడి హరిణి, సీహెచ్ఓ ఆర్.ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ బి.కృష్ణ, సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు, ఫీల్డ్ వర్కర్ ఏ సుధాకర్, స్టాఫ్ నర్స్ అన్నపూర్ణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పొలంలో నవధాన్యాలు



నవధాన్యాలు చల్లుతున్న రామకృష్ణ, రైతులు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రామానికి చెందిన పల్లకి సత్యనారాయణరెడ్డి పొలంలో వెల్లంపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి కే రామకృష్ణ బుధవారం నవధాన్యాలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు బోర్డు గోల్డెన్ జూబ్లీ కార్యక్రమంలో భాగంగా ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని బోర్డు నుంచి రైతు పొలంలో నవధాన్యాలు చల్లినట్లు తెలిపారు. జేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమి రోజును ఏరువాక పౌర్ణమిగా రుతుపవనాల రాకకు గుర్తుగా జరుపుతుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీహర్ష, కంపెనీల ప్రతినిధులు జస్వంత్, శరత్, పలువురు రైతులు పాల్గొన్నారు.